సాక్షి చిత్తూరు

గురువారం । 17 । అక్టోబర్ । 2024



కృష్ణార్పణం

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు ఆపివేయించి బాబు సర్కారు ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులపై కక్ష తీర్చుకుంటోంది. - 8లో



జిల్లాకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు

అల్పపీడనం వాయుగుండంగా మారనుండడంతో జిల్లాకు ఫ్లాగ్ ఫ్లడ్ ముప్పు ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. - 8లో



జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా వైద్యసిబ్బంది జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

మిలిటరీ లాంఛనాలతో అంత్యక్రియలు



అల్తాఫ్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న మిలిటరీ బలగాలు

కల్లూరు(పులిచెర్ల): కల్లూరు మండలం కోట పల్లె రోడ్డుకు చెందిన ఎస్.అల్తాఫ్(47) లడక్‌లోని మిలిటరీలో గత కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇతను ఢిల్లీలోని మిలిటరీ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. బుధవారం అల్తాఫ్ మృతదేహాన్ని స్వగ్రామం కల్లూరుకు తీసుకొచ్చారు. గ్రామంలో మిలిటరీ లాంఛనాలతో అల్తాఫ్ అంత్యక్రియలు నిర్వహించారు.

సార్వత్రిక ఎన్నికల అదనపు బడ్జెట్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ ఏడాదిలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల అదనపు బడ్జెట్‌ను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన బడ్జెట్ మొదటి దశలో నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికలకు ఖర్చు చేసిన మొత్తంలో రెండవ విడతకు గాను చిత్తూరు జిల్లాకు రూ.19.18 కోట్లు బడ్జెట్‌ను విడుదల అయింది. ఈ నిధులను ఖర్చు చేసిన పెండింగ్ బిల్లులకు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్‌ను ఆదేశించారు.

స్క్రీనింగ్ పరీక్షలు రేపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో శుక్రవారం వినికిడి లోపానికి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శిరీష బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో వినికిడి సమస్య ఉన్నట్లయితే వారికి ఉచితంగా వినికిడి పరికరాలు అందజేస్తారన్నారు. వీటి కోసం వచ్చేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫొటోలు, ఆడియో గ్రామ్ రిపోర్ట్ తప్పకుండా తీసుకోరావాలని ఆమె పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకేంద్రంలో ఈ నెల 17వ తేదీన వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాల్‌లో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమానికి అధికారులు, సంఘనాయకులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

పీఎంశ్రీ స్కూళ్లను అభివృద్ధి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా గుర్తించిన పీఎంశ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 40 పీఎంశ్రీ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను మెరుగు పరచాలన్నారు. పీఎంశ్రీలో మొదటి విడతలో 30, రెండవ విడతలో 10 స్కూళ్లు జిల్లాలో ఎంపికైనట్లు తెలిపారు. మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో ల్యాబ్స్, ఆటస్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌లను పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో పాఠశాల ప్రహరీలు నిర్మించేందుకు అవకాశం ఉందన్నారు. స్కూళ్లలో పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. సమీక్షలో డీఈఓ దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై పచ్చగద్దలు

పుంగనూరు మున్సిపాలిటీ శాంతినగర్‌లో జగనన్న కాలనీ లేఅవుట్‌లో జేసీబీలతో చదును చేసిన దృశ్యం



అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెట్టు, పుట్ట, వాగు, వంక.. ఇలా ఏదీ వదలకుండా ప్రకృతి సంపదను తరలించి కోట్లు దండుకున్న కూటమి నేతల కన్ను ఇప్పుడు జగనన్న కాలనీలపై పడింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పేదవారికి ఇళ్లను మంజూరు చేసింది. దీంతో ఆయా లేఅవుట్ల సమీపంలో భూముల ధరలు భారీగా పెరిగాయి. తాజాగా పుంగనూరు మున్సిపాలిటీలో పేదలకు కేటాయించిన జగనన్న కాలనీ లేఅవుట్లలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాత్రికి రాత్రే జేసీబీలతో రాళ్లను తొలగించి చదును చేయించారు.

- పేదవాడి సొంతింటి కలను సాకారం చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చాలాచోట్ల ఇళ్లు కట్టడంతో పట్టణాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- కాలనీల సమీపంలో అమాంతం పెరిగిన భూముల ధరలు
- పేదలకిచ్చిన స్థలాల్లో టీడీపీ నేతల ఆక్రమణల పర్వం
- ఆఖరికి ముస్లింలు, ఎస్సీ, ఎస్టీల స్థలాలకూ ఎసరు !
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయాలన్న ఉద్దేశంతో ఇళ్లను మంజూరు చేసింది. అంతేగాకుండా భూములు లేని చోట ప్రభుత్వం నిధులు వెచ్చించి మరీ స్థలాలు కొని పేదలకు పట్టాలు మంజూరు చేసింది. దీంతో చాలాచోట్ల జగనన్న కాలనీలు పట్టణాలుగా మారుతుండడంతో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి కూటమి నేతలు అక్రమంగా ఇసుక, మట్టి, భూముల ఆక్రమణలకు పాల్పడుతూ వస్తున్నారు. ఇప్పుడు వారి కన్ను జగనన్న కాలనీలపై పడింది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఆ స్థలాలను, పునాదులను పెరికివేసి, కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఏమీ ఎరగనట్లు ఉండడంతో కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయి. పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పుంగనూరులో జగనన్న కాలనీలు



పుంగనూరు మున్సిపాలిటీ పిచ్చిగుండ్లపల్లి రహదారి వద్ద ఇంటి స్థలాలను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి (ఫైల్)

మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరులో వైఎస్సార్‌సీపీ హయాంలో పట్టణ సమీపంలోని రాంపల్లి, గూడూరుపల్లి, రాగానిపల్లి, శుభారాం డిగ్రీ కళాశాల వద్ద, పిచ్చిగుండ్లపల్లి రహదారి వద్ద 7 జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను 75.62 ఎకరాల భూమిని కాలనీల కోసం కేటాయించారు. ఇందులో 1,694 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, గృహాలు మంజూరు చేశారు. ఇందులో అధిక శాతం గృహాలు నిర్మించారు. అలాగే టిడ్కో గృహాలు 1,539 మందికి పంపిణీ చేసి, నివాసయోగ్యం కల్పించారు. నీరు, విద్యుత్ దీపాలు, సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంతో కాలనీలు పట్టణాలుగా అభివృద్ధి చెందాయి.

కాలనీలకు కేటాయించిన భూమి

పుంగనూరు పట్టణ సమీపంలోని రాంపల్లి సర్వే నంబరు 407, 408లో 2.50 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. గూడూరుపల్లి వద్ద రెండు కాలనీలు ఏర్పాటు చేశారు. ఇందుకు గాను 23.88 ఎకరాల భూమిని కేటాయించారు. శుభారాం డిగ్రీ కళాశాల వద్ద సర్వేనంబరు.46/2లో 3.05 ఎకరాల భూమిని కేటాయించారు. పిచ్చిగుండ్లపల్లి సర్వేనంబరు 336, 337, 342లో 10.55 ఎకరాల భూమిని కేటాయించారు. రాగానిపల్లి వద్ద సర్వేనంబరు–77లో 9.42 ఎకరాల భూమిని కేటాయించారు. ఇదే ప్రాంతంలో రెండో కాలనీ ఏర్పాటు చేసి సర్వేనంబర్లు 71, 73, 7లో 23.14 ఎకరాలు భూమి కేటాయించి, ఇందులో 1,694 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అలాగే 1,100 మందికి గృహ నిర్మాణాలు మంజూరు చేయగా, అందులో 700 మందికి పైగా ఇళ్లు కట్టేశారు. మిగిలినవి పునాదులు, కట్టడాల దశలో ఉన్నాయి.

ఆక్రమణల పర్వం..

జగనన్న కాలనీ రాంపల్లి వద్ద గల శాంతినగర్ సమీపంలో సర్వే నంబరు 407, 408లో 83 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయగా, ఇక్కడ ఉన్న 2.5 ఎకరాల భూమిని టీడీపీ నేతలు కబ్జా చేశారు. పిచ్చిగుండ్లపల్లి రహదారిలో 10.55 ఎకరాల భూమిని గత ప్రభుత్వం కొనుగోలు చేసి, అందులో 462 మందికి పట్టాలు పంపిణీ చేసింది. ఇక్కడా పచ్చనేతలు ఏకంగా 6 ఎకరాల భూమిని చదును చేసి కబ్జా చేశారు. అలాగే సర్వే నంబర్లు 71, 73, 74లో 23.14 ఎకరాలు కొనుగోలు చేయగా, ఇక్కడ కూడా సుమారు 3 ఎకరాల భూమిని కబ్జా చేసి, పంటలు వేశారు. కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సదరు భూ యజమానులకు అప్పట్లో ఒక్కొక్కరికి ఎకరాకు రూ.16 లక్షల నుంచి రూ.26 లక్షల వరకు నష్టపరిహారాన్ని అందించిది. కానీ తెలుగుదేశం నాయకులు ఈ మూడు ప్రాంతాల్లో ఏర్పాటైన జగనన్న లేఅవుట్లలో రాళ్లను పెరికేసి, జేసీబీలతో చదును చేసి, సుమారు 11.50 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారు. రాంపల్లిలోని శాంతినగర్‌లో కబ్జాకు గురైన స్థలం మార్కెట్ ధర రూ.3 కోట్లు విలువ చేస్తుంది. రాగానిపల్లెకు కబ్జాకు గురైన రెండుకరాలు రూ.2 కోట్లు, పిచ్చిగుండ్లపల్లె వద్ద కబ్జాకు గురైన 6 ఎకరాల మార్కెట్ విలువ రూ.3 కోట్లు విలువ చేస్తుంది. కబ్జాకు గురైన భూముల మార్కెట్ విలువ సుమారు రూ.8 కోట్ల మేరకు ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా జగనన్న కాలనీలను పరిశీలించి, మాజీమంత్రి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్, తహసీల్దార్‌కు లేఅవుట్లలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జగనన్న కాలనీ లేఅవుట్‌లో తొలగించిన హద్దురాళ్లు



పుంగనూరు : శాంతినగర్ జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా



పునాదులను ధ్వంసం చేసిన దృశ్యం

చేతులు మారుతున్న నకిలీ కరెన్సీ



చౌడేపల్లెలో నకిలీ రూ.500 నోటు

చౌడేపల్లె: మండలంలో రూ.500, రూ.200 నకిలీ కరెన్సీ చెలామణి జోరుగా సాగుతోంది. స్థానిక బస్టాండు సమీపంలోని ఒక ఒక దుకాణ యజమాని బుధవారం నకిలీ కరెన్సీ నోటును గుర్తించాడు. ఏమాత్రం తేడా లేకుండా ఉన్న నకిలీ రూ.500 నోటును గమనించి ఇరుగుపొరుగువారికి చూపించారు. నెల రోజులుగా నకిలీ నోట్లు బెడద తీవ్రంగా ఉందని దుకాణదారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలపై ఏనుగుల దాడి



టమాటా పంటను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని మతుకువారి పల్లె, మేకలవారిపల్లెలో బుధవారం తెల్లవారుజామున దాదాపు ఐదు ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పంటలను నాశనం చేశాయి. మేకలవారిపల్లెలో రైతు జనార్దన్ సాగు చేసిన టమాటా పంటను ధ్వంసం చేయగా, మతుకువారి పల్లెలో రైతు రాజారెడ్డికి చెందిన మామిడి తోపులో ఫెన్సింగ్ కూసాలను తొక్కి విరిచేసి, అలాగే అతని వరి పంటను తొక్కి నాశనం చేశాయి. గత వారం రోజులుగా మండలంలో తిష్ట వేసిన ఏనుగులు పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. అధికారులు ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

జాగ్రత్త వహించండి



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

యాదమరి(పూతలపట్టు): వర్షపు నీరు పొలాల్లో నిలవకుండా జాగ్రత్త వహించాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో వర్షానికి నేలమీద వాలిపోయిన వరి పంటను పరిశీలించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిని కోసి దుబ్బులుగా కట్టుకోవాలని, ఇప్పటికే కోసిన వరి పంట పొలంలో ఉంటే తక్షణమే కట్టలుగా కట్టి కుప్పలుగా వేసి భద్రపరచాలని సూచించారు. వరి పనలు వర్షపు నీటిలో తడిస్తే గింజలు మొలకొచ్చే అవకాశం ఉందని తెలిపారు. వాటిపై ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఓ చరిత, రైతులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పని చేయండి



జ్యోతి ప్రజ్వలన చేసి మొదటి తరగతులు ప్రారంభిస్తున్న అతిథులు

గుడుపల్లె: వైద్య విద్యార్థులు సేవా దృక్పథంతో పని చేయాలని బెంగళూరు హెచ్‌జీసీ రీజనల్ డైరెక్టర్ విశాల్‌రావు తెలిపారు. గురువారం పీఈఎస్ మెడికల్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి వైద్య కళాశాల ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 23వ బ్యాచ్ తరగతుల ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్య, విద్య ఎంతో విలువైందని, కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థి దశ నుంచే ఉండాలన్నారు. అనంతరం వైద్య విద్య పరీక్షలను డిస్టింక్షన్ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, బహుమతులను ప్రదానం చేశారు. బెంగళూరు యూటీస్ గ్రూపు ఎండీ చంద్రశేఖర్, పీఈఎస్ మెడికల్ డైరెక్టర్ సురేష్ కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ కృష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి



పలమనేరు: మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రోజా ఆధ్వర్యంలో జరిగిన మండలమీట్‌లో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల వరి, టమాటా పంటలతో పాటు ఇతర కూరగాయల పంటలకు ముసురు వర్షంతో నష్టం వాటిల్లిందన్నారు. మల్బరీ రైతులు పట్టుపురుగులను పెంచడంతో వర్షానికి ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. అధికారులు అంచనా వేసి పంట నష్టపరిహారాన్ని రైతులకు చెల్లించాలని సూచించారు. అనంతరం ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీలు జయశ్రీబాలాజీనాయుడు, గజేంద్రన్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు మండల అభివృద్ధిపై దృష్టిని సారించాలని సూచించారు. సమావేశంలో పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..?

బైరెడ్డిపల్లి : సమయపాలన పాటించకుండా, ప్రజలకు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా విధులకు వస్తారా ? అంటూ సచివాలయ సిబ్బందిపై జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆయన బైరెడ్డిపల్లె సచివాలయం-2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సచివాలయంలో ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 20 నిమిషాల పాటు ఆయన కార్యాలయంలో ఉన్నా ఒక్క ఉద్యోగి కూడా రాకపోవడంతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఎంపీడీఓ రాజేంద్రబాలాజీని వివరణ కోరగా బైరెడ్డిపల్లె-2 సచివాలయంలో 6 గురు ఉద్యోగులు ఉన్నారని, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శిని పనులపై పంపడం జరిగిందన్నారు. మిగిలిన నలుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.99కే మద్యం.. అంతా అబద్ధం

- జిల్లాలో 50 శాతం తెరుచుకున్న ప్రైవేటు మద్యం దుకాణాలు
- తొలిరోజే నిబంధనల ఉల్లంఘన
- నిరాశ వ్యక్తం చేస్తున్న మద్యంప్రియులు
- పలుచోట్ల దుకాణాల ఏర్పాటుపై ప్రజల అభ్యంతరం



చిత్తూరులోని ఓ మద్యం దుకాణం వద్ద మందుబాబులు

చిత్తూరు అర్బన్: తాము అధికారంలోకి వస్తే రూ.99కే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులో తీసుకొస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం రూ.వందల కోట్లు మద్యం వ్యాపారుల నుంచి రాబట్టుకుని చోద్యం చూస్తోంది. ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చినా.. జిల్లాలో ఎక్కడా కూడా రూ.99 క్వార్టర్ బాటిల్ కనిపించలేదు. ఇది మద్యం ప్రియులను నిరాశకు గురిచేసింది. మరోవైపు తొలి రోజున జిల్లాలో 50 శాతం మాత్రమే దుకాణాలు తెరుచుకున్నాయి.

బెదిరింపుల పర్వంతో ..

నూతన మద్యం పాలసీ ప్రకారం జిల్లాలో 104 మద్యం దుకాణాలు బుధవారం తెరచుకోవాల్సి ఉంది. కానీ తొలిరోజున మొత్తంగా 51 దుకాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల వ్యాపారులకు దుకాణాలు దొరక్కపోగా, మరికొన్ని చోట్ల సిండికేట్లుగా ఏర్పడిన కూటమి నేతలు.. తమను కాదని లక్కీడిప్ ద్వారా లైసెన్సులు తెచ్చుకున్న వాళ్లకు దుకాణాలు ఇవ్వకూడదని హెచ్చరికలు పంపించారు. ఫలితంగా మద్యం ప్రియులకు తొలి రోజున తిప్పలు తప్పలేదు. పలమనేరు, నగరి, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో లక్కీడిప్ ద్వారా దుకాణాలు వచ్చిన ఆరుగురు వ్యాపారుల నుంచి బలవంతంగా అగ్రిమెంట్లు రాయించుకున్న అధికారపార్టీ నేతలు, నెలసరి కమిషన్ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇక పలమనేరులో లాటరీలో వచ్చిన మూడు దుకాణాలను తీసుకోవద్దంటూ స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధి బెదిరించడంతో ముగ్గురు వ్యాపారులు వెనకడుగు వేశారు. ఆ నేత అనుకున్నట్టుగానే లాటరీలో రెండో పేర్లు వచ్చిన ముగ్గురికి దుకాణాలు కేటాయించారు.

ప్రీమియం బ్రాండ్లు ఎక్కడ..?

మరోవైపు మద్యం దుకాణాల్లో పేరున్న బ్రాండ్లకు సంబంధించిన మద్యం పెద్దగా కనిపించలేదు. ఓల్డ్ అడ్మిరల్, మాన్షన్‌హౌస్, హనీబీ లాంటి బ్రాండ్లు దర్శనమిచ్చాయి. బీర్లలో కింగ్ ఫిషర్, అల్ట్రా, కాల్స్‌బర్గ్ మాత్రమే ఉన్నాయి. ఈనెలాఖరు వరకు పాత బ్రాండ్లే ఉంటాయని, కొత్త బ్రాండ్లు రావడానికి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

మద్యం దుకాణాలు ఇక్కడ వద్దు..

మద్యం దుకాణాలను జనావాసాల మధ్య ఏర్పాటు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కొళ్లగుంటలో నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం తెరవడాన్ని నిరసిస్తూ మహిళలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో ఓ దుకాణం పెడుతుండగా స్థానికులు వచ్చి అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు.

మొదటిరోజే నిబంధనల ఉల్లంఘన

తొలి రోజు అమ్మకాల్లోనే మద్యం వ్యాపారులు వినియోగదారులకు ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలన్న నిబంధనను ఉల్లంఘించారు. చాలా చోట్ల చీప్‌లిక్కర్‌గా ఉన్న ఓల్డ్ అడ్మిరల్ క్వార్టర్ బాటిల్‌ను రూ.130 వరకు విక్రయించారు. దీనిపై ఎమ్మార్పీ రూ.120గా ఉండడం విశేషం. ఎక్సైజ్ అధికారుల నుంచి మాత్రం ఎక్కడా స్పందన లేదు.

క్లుప్తంగా

గోతిలో పడిన ఎద్దు



నీటి సంపులో ఇరుక్కుపోయిన ఎద్దు

చౌడేపల్లె: మేత మేస్తూ వెళ్తున్న ఓ ఎద్దు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఇరుక్కుపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రాములవారి గుడి సమీపంలో ఉన్న బెల్లాల గోవిందు ఒంటెద్దు బండితో జీవనం సాగిస్తున్నాడు. వర్షం కురుస్తుండడంతో బజారువీధిలో ఖాళీ జాగాలో ఎద్దును వదలడంతో గడ్డి మేస్తూ ముందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు సంపు గోతిలో పడింది. గమనించిన స్థానికులు ఎద్దును వెలికితీసేందుకు యత్నించి, వీలు కాకపోవడంతో జేసీబీతో చాకచక్యంగా బయటకు తీశారు.

నిబంధనలు పాటించాలి




కొనుగోలుదారులకు వాహనాలను అందజేస్తున్న డీటీసీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వాహన చట్టాలకు అనుగుణంగా..వాహన షోరూం నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరంలో పలమనేరు రోడ్డు బుధవారం ఓ ఎలక్ట్రికల్ టూవీలర్ షోరూంను డీటీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతక్ వెహికల్ ఇండియాలో సాలిడ్ మెటల్ బాడీతో తయారయ్యే మొదటి ఎలక్ట్రిక్ టూవీలర్ అన్నారు. వాహనానికి 5 ఏళ్ల వారెంటీ ఉందని, రోడ్ సైడ్ అసిస్టెన్స్ ఉందని, లైఫ్ టాక్స్ లేదని తెలియజేశారు. కార్యక్రమంలో కేవీబీ డివిజనల్ మేనేజర్ పి.సత్యనారాయణ, శ్రీనివాస మోటార్స్ అధినేత జీవరత్నంరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు

జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే అల్పపీడనం మరికొద్ది గంటల్లో వాయుగుండంగా మారనుందని.. చెన్నైకి 280 కి.మీ, నెల్లూరుకు 370 కి.మీ దూరంలో కేంద్రీకృతం కానుంది. పశ్చిమ వాయువ్యదిశగా 15.కి.మీ వేగంతో వాయుగుండం కదలనుంది. ఈ పరిస్థితుల్లో చిత్తూరు జిల్లాకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు పొంచి ఉందని విశాఖ వాతావరణ శాఖ కేంద్రం హెచ్చరించింది. అధిక వర్షాల కారణంగా జిల్లాలోని స్కూళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 17న సెలవు ప్రకటించారు.

- ఈదురు గాలులు.. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం
- నగరి, జీడీనెల్లూరు, చిత్తూరులో భారీ వర్షం కురిసే సూచన
- పునరావాస కుటుంబాలకు సరుకులు సిద్ధం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు



వాతావరణ శాఖ విడుదల చేసిన అధిక వర్షాల చిత్రం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఈ మేరకు అల్పపీడనం మరికొద్ది గంటల్లో వాయుగుండంగా మారనుందని, అది బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల మధ్యలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట దగ్గరలో తీరం దాటనుంది. చిత్తూరు జిల్లాకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు పొంచి ఉందని విశాఖ వాతావరణ శాఖ కేంద్రం బుధవారం హెచ్చరించింది. ఈ ప్రభావంతో నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో భారీ వర్షం నమోదు కానున్నట్లు ప్రకటించింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సమీపంలోని స్కూళ్లు, కళాశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు కసరత్తు సిద్ధం చేశారు.

అందుబాటులో మందులు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం 40 నుంచి 50 కి.మీ మేర బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందు వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం నివారించేందుకు కరెంట్ స్తంభాలను ఆ శాఖ అధికారులు సిద్ధం చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా అవసరమైన మందులను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆయా గ్రామాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు.

తస్మాత్ జాగ్రత్త ..!

రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి అందిన సమాచారం మేరకు నగరి, జీడీ నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి ఆకస్మిక వరదలు(ఫ్లాష్ ఫ్లడ్స్) వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేసింది. నిత్యావసర సరకులను పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసింది. ఒక్కో కుటుంబానికి బియ్యం, కందిపప్పు, పంచదార, పామోలిన్‌ను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో సహాయక చర్యలకు అవసరమైన సిబ్బందిని, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని అధికారులు వెల్లడించారు.

నింద్రలో అత్యధిక వర్షపాతం....

జిల్లాలోని నగరి నియోజకవర్గం నింద్ర మండలంలో బుధవారం 117.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 37.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో బుధవారం 1190.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సమస్యలు తలెత్తకుండా..



అధిక వర్షాలకు జిల్లా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. అధిక వర్షాలు పడే ప్రాంతాల్లో సహాయక చర్యలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. క్షేత్రస్థాయిలో మండల అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు సంబంధిత స్థానాల్లోనే ఉండాలని ఆదేశాలు ఇచ్చాం. ప్రజలు ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. 17న అధిక వర్షాలు కురుస్తాయన్న కారణంగా స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించడం జరిగింది.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

సహాయక చర్యలకు సిద్ధం..



జిల్లాలో అధిక వర్షాలు కురిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపడతాం. చెట్లు విరిగిపడితే, ఎక్కడైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఇప్పటికే సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వడం జరిగింది. అనుకోని ఘటనలు జరిగితే ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇవ్వాలి. – పెద్దిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, చిత్తూరు జిల్లా

జాగ్రత్తలు పాటించాలి



కె.పట్నం ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీపీఓ పార్వతి

- వైద్య సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటి సర్వే చేయండి
- మాతాశిశు సంరక్షణపై అవగాహన కల్పించండి
- వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

తవణంపల్లె: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రభావతిదేవి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని కె.పట్నం సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పట్నంలోని వీధులను, ఇళ్ల మధ్యలో ఉన్న కోళ్లఫారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డయేరియా, దోమకాటుతో వచ్చే మలేరియా, డెంగ్ జ్వరాలపై వైద్యాధికారులు రోజూవారి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. అత్యవసర సీరియస్ కేసులను 108లో ఆస్పత్రులకు రెఫర్ చేయాలని మరణాలు జరగకుండా చూడలన్నారు. ప్రైవేటు, ఆర్ఎంపీల వద్ద జ్వరం కేసుల డేటాను పర్యవేక్షించి నివేదిక ఇవ్వాలని కోరారు. మాతాశిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారం, రక్తహీనతపై తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ప్రియాంక, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడండి

చిత్తూరు కార్పొరేషన్: తుపాను నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఇన్‌చార్జ్ డీపీఓ పార్వతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కాలువల్లో సకాలంలో పూడికలు తొలగించి, వీధుల్లో చెత్తాచెదారాలు తీయాలన్నారు. క్రిమికీటకాలు చేరకుండా బ్లీచింగ్ చల్లాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, అలాగే మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి వాటిపై తేదీలను రాయాలన్నారు. మిలాథిన్‌ను నిల్వ ఉంచుకోవాలన్నారు. రాత్రివేల ఫాగింగ్ చేయాలని, మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానస ఆగమం

తిరుపతి సిటీ : భారతీయ సంస్కృతికి ఆధారం వైఖానస ఆగమమేనని మైసూర్ మహారాజ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం వైఖానస ఆగమోక్త అర్చనం అన్న అంశంపై జాతీయ సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం నుంచి ప్రాయశ్చిత్తాల వరకు వేదమంత్రాలతో ఇమిడి ఉన్నదే వైఖానసాగమమని చెప్పారు. అనేక గ్రంథాలు వైఖానస వాఙ్మయంలో మహర్షులు ఉపదేశించినప్పటికీ కొన్ని మాత్రమే ప్రస్తుతం లభ్యమవుతున్నాయని తెలిపారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీవారికి అర్చనల వైఖానస ఆగమంలో చెప్పిన విధంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ అర్చనాజ్ఞానం వైదికులు, లౌకికులకు తెలియజేయాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు.



జాతీయ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు

యువకుడి ఆత్మహత్య

కుప్పంరూరల్: కుప్పం పట్టణంలోని గాంధీరోడ్డులో ఓ యువకుడు అనుమానాస్పదంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గాంధీరోడ్డుకు చెందిన యువకుడు చాంద్‌బాషా (27) ఇంటిలోని పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి చాంద్‌బాషను కిందికి దింపి తండ్రికి సమాచారం ఇచ్చారు. ఆరునెలల క్రితం తల్లి చనిపోవడం , తండ్రి వృత్తిరీత్యా పలమనేరుకు వెళ్లడంతో యువకుడు ఒంటరిగా ఉంటున్నాడు. అయితే చాంద్‌బాష చాలా ఉత్సాహంగా ఉండే వాడని, ఆత్మహత్య చేసుకున్నాడంటే నమ్మలేకున్నామని స్థానికులు అన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

ప్రాణరక్షణ కల్పించండి

చిత్తూరు రూరల్(కాణిపాకం): తన భర్త పట్టాభి నుంచి తనకు, తన బిడ్డకు ప్రాణరక్షణ కల్పించాలని చిత్తూరు నగరం మురకంబట్టు కొత్తూరుకు చెందిన రోజా కోరారు. చిత్తూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 13 ఏళ్ల కిందట తనకు పట్టాభితో పెళ్లి జరిగిందన్నారు. అప్పటి నుంచి అతను తనను అనుమానిస్తూ.. మానసికంగా హింసించేవాడని ఆరోపించారు. కొన్ని నెలల కిందట ఇంట్లో నుంచి తమను తరిమేశాడన్నారు. తన చెల్లి సాయంతో తలదాచుకుంటున్నా అని, తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఆమె తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,891 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,423 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత కూడా ఎక్కువగా పెరగడంతో వర్షంలోనే చలువ పందిళ్ల వద్ద తలదాచుకుంటున్నారు. తిరుమలలోని దుకాణాలను మూసివేశారు.

బాధ్యతగా పనిచేయండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పాలసముద్రం : అధికారులు బాధ్యతగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం ఆయన రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలకు గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. వెంగళరాజుకుప్పం ఉప సర్పంచ్ సుమన్ తమ పంచాయతీలోని వీర్ల గుడి దళితవాడకు సీసీ రోడ్డు, సోలార్ లైట్లు కావాలని కలెక్టర్‌కు విన్నవించారు. వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు బస్టాండ్, రోడ్డు కావాలని అర్జీ ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ నివేదికలు ఇవ్వాలని, బస్టాప్ కావాలంటే మంజూరు చేస్తానని, రోడ్డు వేయడానికి నిధులు లేవని తెలిపారు. బలిజకండ్రిగ–చిత్తూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో వంతెన ఎప్పుడు కూలుతుందో అని భయంగా ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. ఎంపీడీఓ కార్యాలయం వర్షానికి ఉరుస్తుండడంతో వెళ్లి పరిశీలించారు. వెంగళరాజుకుప్పం ఫీల్డ్ అసిస్టెంట్ సరోజను అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో విధుల నుంచి తొలగించారని, తమకు న్యాయం చేయాలని బాధితురాలి అత్త ఈ సందర్భంగా కలెక్టర్‌కు చేతులు జోడించి వేడుకున్నారు.



రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మెరుగైన వైద్యం అందించండి

పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి అత్యవసర మందులు అందించాలన్నారు. ప్రతి బుధవారం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో 24 గంటలు ప్రజలకు వైద్య పరీక్షలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ కుమార్, ఎంపీడీఓ విద్యావతి, ఎస్ఐ భారతి, సర్వేయర్ గణేష్, మండల విస్తరణాధికారి రమేష్, వైద్యాధికారి మోహన్‌కృష్ణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కృష్ణార్పణం!

ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కరువు రైతాంగానికి పుష్కలంగా సాగునీరు, ప్రజలకు తాగునీటిని అందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులపై ప్రస్తుత చంద్రబాబు సర్కార్ కక్ష కట్టింది. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో చేపట్టిన మూడు రిజర్వాయర్ల పనులు జరగకుండా టీడీపీ నేతల ద్వారా ఎన్‌జీటీలో ఫిర్యాదు చేయించి పనులు ఆపివేయించి రైతులపై కక్ష తీర్చుకుంటున్నారు. ఈ మూడు రిజర్వాయర్లు పీబీసీ విస్తరణ పనులపై ఆధారపడి ఉన్నాయి.

- కరువు రైతులపై కక్ష తీర్చుకుంటున్న చంద్రబాబు
- హంద్రీ–నీవా ప్రాజెక్టులో కీలకమైన పుంగనూరు ఉపకాలువ విస్తరణకు సర్కారు బ్రేక్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,217.49 కోట్లతో చేపట్టిన పనులు నిలిపివేత
- కొత్తగా లైనింగ్ పనుల ప్రతిపాదనలకు ఆదేశాలు
- రూ.4,373 కోట్లతో చేపట్టిన జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం పనులూ నిష్ఫలమే !
- కృష్ణా జలాలు అందకుండా 3 రిజర్వాయర్లను ఎండబెట్టాలన్నదే చంద్రబాబు కుట్ర





మద్దయ్యగారిపల్లె వద్ద కాలువ విస్తరణ పనులను ఆపేసిన దృశ్యం, బి.కొత్తకోట వద్ద నిలిపిన యంత్రాలు

బి.కొత్తకోట: ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల రైతులకు తాగు, సాగునీటి ప్రయోజనాలపై కూటమి సర్కారు కక్ష కట్టింది. రైతులను దృష్టిలో పెట్టుకుని వేల కోట్ల ప్రాజెక్టుల పనులు ఆపి వేయాలని చంద్రబాబు కుటిల రాజకీయాలకు తెరదీశారు. రైతులపై తీవ్ర ప్రభావం చూపేలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపట్టిన ఏవీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టు ఫేజ్–2 పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) విస్తరణ పనులను ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నిలిపివేశారు. 2022 సెప్టెంబర్, 26న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఈ పనులకు టెండర్ల నిర్వహణ పూర్తి చేశాక, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం కూడా జరిగింది. ఆ కాంట్రాక్టు సంస్థ మదనపల్లెలోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుకు సంబంధించిన పనులు, గత నెల 26న అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం మద్దయ్యగారిపల్లె వద్ద పీబీసీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. సరిగ్గా మూడు వారాలకే పనులు నిలిపి వేయించారు.

1,180 క్యూసెక్కులకు విస్తరణ

ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పులికల్లు వద్ద కిలోమీటర్ 79 నుంచి పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం తిమ్మిరెడ్డిగారిపల్లె వద్ద 220.350 కిలోమీటర్ వరకు పీబీసీ సాగుతుంది. దీని నీటి ప్రవాహ సామర్థ్యం 380 క్యూసెక్కులు. సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఈ కాలువ ద్వారా ఇక్కడికి తరలిస్తారు. ఈ కాలువ సామర్థ్యం మరో 800 క్యూసెక్కులకు పెంచి మొత్తం 1180 క్యూసెక్కులతో పుష్కలంగా కృష్ణాజలాలను తరలించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఈ పనులకు 2021లో రూ.1,929 కోట్లతో పాలనాపరమైన అనుమతులు ఇవ్వగా రూ.1,219.9 కోట్లకు సాంకేతిక అనుమతి కూడా ఇచ్చారు. ఈ నిధులతో 2022 సెప్టెంబర్ 26న నిర్వహించిన రివర్స్ టెండర్లలో రూ.1,217.49 కోట్లకు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టు దక్కించుకుంది. తర్వాత చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సంబంధించిన పనులు చేపట్టగా ప్రభుత్వం రూ.177 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. గత నెలలో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో కాలువ విస్తరణ పనులను భారీ యంత్రాలు, ఇతరా వాహనాలు, సిబ్బందితో మొదలు పెట్టారు. అయితే బుధవారం ఉన్నపళంగా పనులు నిలిపివేయాలని ప్రాజెక్టు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎక్కడిపనులు అక్కడే ఆపివేశారు.

లైనింగ్‌కు ప్రతిపాదనలు ఇవ్వండి..

పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు నిలిపివేయించిన చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పీటీఎం మండలం నుంచి గంగవరం వరకు సాగే కాలువకు లైనింగ్ పనులు, కాంక్రీటు నిర్మాణాల కోసం ని ధులు ఎంత అవసరం అనేదానిపై నివేదికలు పంపాలని ఆదేశించింది. దీనిపై ప్రాజెక్టు ఎస్ఈ రాజగోపాల్ మాట్లా డుతూ ప్రభుత్వ సూచనల మేరకు విస్తరణ పనులు నిలిపివేసినట్టు చెప్పారు. వాటిస్థానంలో లైనింగ్ పనులకు ఎంత వ్యయం అవుతుందో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినట్టు చెప్పారు.

అనుసంధాన పథకాన్ని ముంచినట్టే..

పీబీసీ విస్తరణ పనుల నిలిపివేతతో హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టుల అనుసంధాన పనులను చంద్రబాబు సర్కార్ ముంచినట్టే. వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 13 టీఎంసీల కృష్ణా జలాలను తరలించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలయజ్ఞమే చేసింది. ఈ పథకానికి రూ.5,030 కోట్లు మంజూరు చేయగా రూ.4,373.23 కోట్లతో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టింది. ఇందులో రూ.1,100 కోట్ల పనులు పూర్తి చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను కాలేటివాగు, కల్లూరుపల్లె రిజర్వాయర్, వెలిగల్లు జలాశయానికి నీటిని తరలించి అక్కడి నుంచి ప్రస్తుత అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి నీటిని తరలించాక పైప్‌లైన్, రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా పెద్దతిప్పసముద్రం వద్ద పీబీసీలోకి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికే పీబీసీ విస్తరణ పనులు చేపట్టారు. ఈ నీటిని మూడు రిజర్వాయర్లకు, చెరువులకు, ఇదే కాలువ ద్వారా కుప్పానికి తరలిస్తారు. పనుల నిలిపివేతతో అనుసంధాన ప్రాజెక్టు ప్రశ్నార్థకం కావడమే కాక చేసిన పనులు, అయిన ఖర్చు నిష్ఫలమే అవుతాయి.

కక్షతో 3 రిజర్వాయర్లు ఎండబెట్టాలనే..

కరువుకు నిలయమైన తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల రైతులకు కృష్ణా జలాలతో కష్టాలు తీర్చాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ముదివేడు, నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల నిర్మాణం కోసం రూ.2,144.50 కోట్లు మంజూరు చేసింది. ఇందులో నిర్మాణాలకు రూ.1,529.37 కోట్లు కేటాయించగా మూడు రిజర్వాయర్ల పనులను కాంట్రాక్టు సంస్థలు రూ.1,553.96 కోట్లతో దక్కించుకుని పనులు చేపట్టాయి. దీంతో వైఎస్సార్‌సీపీకి రైతులు, ప్రజల్లో మద్దతు పెరుగుతుందన్న కుట్రతో ఎన్‌జీటీలో కేసులు వేయించి పనులు ఆగేలా చేశారు. ప్రధానంగా ఈ రిజర్వాయర్లకు 6.5 టీఎంసీల కృష్ణా జలాలు తరలించాలంటే పీబీసీ కాలువ విస్తరణ పనులు పూర్తి కావాల్సిందే. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై కక్ష తీర్చు కుంటోంది. రిజర్వాయర్లకు నీటిని తరలించకుండా, 70వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 40వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాగులోకి రాకుండా కక్ష కట్టి రైతాంగాన్ని శిక్షిస్తోంది.